


# బోనస్

- లత కందికొండ

**"మూడు నెలలుగా ఆఫీస్‌లో స్టాఫ్‌కి జీతాలు పూర్తిగా ఇవ్వలేక పోతున్నాడు. రావల్సిన పేమెంట్స్ రావడం లేదు. ఆర్డర్స్ కూడా అంతంత మాత్రంగానే వున్నాయి. ఇదివరలో ఫిఫ్టీ పర్సెంట్ అడ్వాన్స్‌తో వచ్చే ఆర్డర్లుకాస్తా ఇపుడు అడ్వాన్స్ ఇవ్వకపోగా క్రెడిట్ అడుగుతున్నారు కస్టమర్లు. పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. ఇంత గడ్డు పరిస్థితి ఎప్పుడూ లేదు. దీనికితోడు దీపావళికి ఎరియర్స్‌తోపాటు బోనస్ కూడా వస్తుందని స్టాఫ్ అంతా అనుకుంటున్నారు. కానీ ఎలా?... ..."**

పయనీర్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీధర్ ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ...

"సార్ లోపలికి రావచ్చా? బిజీగా వున్నారా?" కాబిన్ దగ్గర నిలబడి అడిగేడు సురేష్... ఆ కంపెనీలో ఆరేళ్లుగా పనిచేస్తున్న సేల్స్ కం సర్వీస్ ఇంజినీర్.

"ఫరవా లేదు. రా సురేష్! కూర్చో" అంటూ ఎదురుగా వున్న కుర్చీ చూపించేడు.

"సార్, మా మదర్‌కి వొంట్లో బాలేదు. ఏవో టెస్ట్స్, అవీ రాసేరు డాక్టర్లు. చేయించాలి" చెప్పేడు సురేష్.


"సెలవు కావాలా?"

"అవును సార్! ఎప్పుడూ టూర్స్ వుండడంతో అస్సలు కుదరడం లేదు. అందుకనే అమ్మని హైదరాబాద్‌లో మా అక్క దగ్గిర దింపి వద్దామనుకుంటున్నాను. అక్కడ హాస్పిటల్ ఫెసిలిటీస్ అవీ కూడా బాగుంటాయి కాబట్టి- ఈరోజు మీరు ఢిల్లీ వెళ్తున్నారని తెల్సింది. నా ఎరియర్స్ క్లియర్ చేసి దానితోపాటు బోనస్ కూడా ఇప్పిస్తే నాకీ సమయంలో చాలా హెల్ప్‌చేసిన వాళ్లవుతారు." చెప్పడం ఆపేడు సురేష్.

"చూడు సురేష్! కంపెనీ ఇప్పుడున్న పరిస్థితిలో జీతాలే సరిగ్గా ఇవ్వలేకపోతున్నానని నీకూ తెలుసు. అలాంటప్పుడు ఈ సంవత్సరం బోనస్ ఇచ్చే ప్రసక్తే లేదు."

"దయచేసి అలా అనకండి సార్. నాకు ఆ డబ్బు చాలా అవసరం" ప్రాధేయపడ్డాడు సురేష్.

"డబ్బు అవసరం ఎవరికుండదు చెప్పు? నీ అవసరంతోపాటు ఈ కంపెనీ పరిస్థితి కూడా గుర్తించే బాధ్యత ఇక్కడ ఇన్నేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగిగా నీకు లేదూ? రోజులు బాగున్నప్పుడు ఠంచనుగా ఒకటో తారీఖు జీతాలిచ్చి మీరడగకుండానే బోనస్‌లు ఇవ్వలేదూ? ఇప్పుడున్న ఈ గడ్డు పరిస్థితిలో మన ఒక్క కంపెనీయే కాదు దేశం మొత్తం ఆ మాటకొస్తే ప్రపంచం మొత్తం ఈ ఆర్థిక సంక్షోభంలో కొట్టుకుంటోంది" తను ఎదుర్కొంటున్న సమస్య తన ఒక్కడిదే కాదన్నట్లు తెలియచేసే ప్రయత్నం చేసేడు శ్రీధర్.



**ఆంధ్రభూమి స్వర్ణోత్సవ కథల పోటీల్లో మూడవ బహుమతి రూ. 3,000/-గెల్చుకున్న రచన**

"సార్! దేశం, ప్రపంచం- సంగతి నాకు తెలియదు. ప్రస్తుతం నా సమస్య మా అమ్మ అమ్మకి వైద్యం చేయించాలి. దానికి డబ్బు కావాలి. అది మీరొక్కరే ఇవ్వగలరు. అది కూడా నేను నాకు రావల్సిన డబ్బులే అడుగుతున్నాను గానీ మిమ్మల్ని అప్పు ఇమ్మని గానీ, మరే విధంగానూ అడగడం లేదు. కంపెనీ ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలిసే- మీరు ఇవ్వాల్సిన ఇన్‌సెన్‌టివ్స్ ఇవ్వకపోయినా ఊర్కున్నాను.

కానీ, నాకిప్పుడు అర్జెంటుగా పాతిక వేలు కావాలి. తక్కినవాళ్ల సంగతేమో గానీ, నేను ఈ డబ్బు పండగ చేసుకోవడానికని అడగడం లేదు. మా అమ్మ వైద్యంకోసం అడుగుతున్నాను." మళ్లీ రిక్వెస్ట్ చేసేడు సురేష్.

"నీకొక్కడికీ ఇస్తే తక్కినవాళ్లు ఊర్కుంటారా? ప్రతి వాడికీ ఏదో ఒక అవసరం వుంటూనే వుంటుంది."

"సార్ నా పరిస్థితి అర్థం చేసుకోండి. మీరు తలచుకుంటే ఈ డబ్బు మీకొక లెక్క కాదు" సురేష్ పట్టువదలక అడుగుతూనే వున్నాడు.

"సారీ సురేష్ నాచేత అన్నిసార్లు- లేదు- అని అన్పించవద్దు. నువ్వింక వెళ్లవచ్చు" అంటూ టేబుల్ మీదనున్న న్యూస్ పేపర్ చేతిలోకి తీసుకున్నాడు శ్రీధర్...

❊ ❊ ❊

ఇది జరిగిన వారం రోజులకి-

"సార్! శ్రీధర్ గారేనా?" ఫోన్‌లో పలకరించింది ఓ ఆడ కంఠం.

"ఎస్! స్పీకింగ్..."

"గుడ్ మార్నింగ్ సార్! నేను భగీరథ కంస్ట్రక్షన్స్ లిమిటెడ్ నుండి- రిసెప్షనిస్ట్ సమీరని మాట్లాడుతున్నాను. మీ ఆఫీస్ ల్యాండ్‌లైన్స్ ఎవరూ లిఫ్ట్ చేయకపోవడంతో- మీ మొబైల్‌కి చేసి డిస్టర్బ్ చేసినందుకు సారీ సార్."

"మా ఫోన్ లైన్స్ అన్నీ ఔట్ ఆఫ్ ఆర్డర్ వున్నాయి- ఫరవాలేదు చెప్పండి" అన్నాడు శ్రీధర్.

"సార్! మీ ఇంజినీర్ రెండురోజుల క్రితం మా సైట్‌లో ఏవో మెషిన్స్ రిపేర్ చేసేరట. అవి మళ్లీ ప్రాబ్లమ్ ఇస్తున్నాయట. అతన్ని వెంటనే పంపమని సైట్‌నుండి మెసేజ్ వచ్చింది" చెప్పింది సమీర.

"మీరు సర్వీస్ రిపోర్ట్ డీటెయిల్స్ అవీ ఇస్తే, నేను ఎంక్వైర్ చేయిస్తాను." అన్నాడు శ్రీధర్.

"సారీ సార్! నాకొచ్చిన మెసేజ్‌లో ఆ వివరాలేం లేవు. నేను మా సైట్‌కి ఫోన్‌చేసి వివరాలు ఇప్పుడే మీకిస్తాను."

"దటీస్ బెటర్" అన్నాడు శ్రీధర్.

అయిదు నిముషాలు కాకుండానే సెల్ మ్రోగింది మళ్లీ.

"సార్! దిసీస్ సమీర ఫ్రం బిసిఎల్ ఎగైన్."

(19వ పేజీ తరువాయి)

అసలు తన భార్య చేసిన పని గట్టిగా బయటికి నలుగురు వినేటట్లు చెప్తే తప్పేనా? అయినా ఇక్కడ తప్పు తన భార్యదా ఆ షోరూం తాలూకు ఇంజినీర్‌దా? లంచం ఇచ్చే వాళ్లుంటేనే పుచ్చుకునేవాళ్లుంటారు. ఇవ్వడం పుచ్చుకోవడం రెండూ తప్పే. ఇలాంటి పై సంపాదన కూడా లంచం లాంటిదే. అతను కంపెనీ రూల్స్ ప్రకారం ఎస్టిమేట్ ఇచ్చినా- తన భార్య ప్రలోభ పెడితేనేకదా అతను లొంగిపోయింది? రూలు రూలే ఎవరికైనా- తన భార్యకొక న్యాయం, మరొకరైతే ఇంకొక న్యాయమునా? అతనికి కూడా జబ్బుచేసిన తల్లో, స్కూల్లో జీతం కట్టాల్సిన పిల్లలో వుండి వుంటారు. తనతో ఇరవై ఏళ్లుగా కాపురం చేస్తున్న తన భార్యే తన పద్ధతులు తెలుసుకోలేకపోయింది. ఇంక ఎవరిని తప్పుపట్టగలడు? అయినా- మీకు ఫోన్‌చేసి చెప్పేను మీరు వెంటనే యాక్షన్ తీసుకోకపోతేనే నేనీ పని చేయాల్సి వచ్చిందని సునీత తిరగబడితే? తను కూడా ఇన్నేళ్ల తమ సాహచర్యంలో భార్యలో ఇలాంటి కోణం మరొకటుందని తెల్సుకోలేకపోయేడు...

జరిగినది జీర్ణించుకోలేకపోతున్నాడు శ్రీధర్.

నువ్వు ఇవ్వకపోతే నేను సంపాదించుకోలేనా అంటున్న సురేష్-

ముప్ఫైఐదు వేలు అడ్డదారిలో ఆదాచేసాననుకుని మురిసిపోతున్న భార్య సునీత-

కనబడని ఆ డబ్బుతో ఖరీదైన మొబైల్ కొనమంటున్న ఇంటర్ చదువుతున్న కొడుకు రవి- కూటికోసమే కోటి విద్యలంటున్న ప్రభాకర్-

దేవుడా! ఈ లోకంలో నీతీ- నిజాయితీ అన్నవి లేవా? బ్రతుకుతెరువుకి ఏది న్యాయం? ఏది అన్యాయం?

ఆ రాత్రి అంతా సరిగ్గా నిద్రపోలేకపోయేడు శ్రీధర్.

కర్ర విరగకుండా పాము చావకుండా ఎలా సాల్వ్ చేయగలడీ ప్రాబ్లమ్‌ని అనుకుంటూ తనలో తనే మధన పడసాగాడు శ్రీధర్.

❊ ❊ ❊

ఆ మర్నాడు-

సునీత ద్వారా ఫోన్ చేయించి, తమ ఇంట్లో ఎక్విప్‌మెంట్ రిపేర్ చేసిన సర్వీస్ ఇంజినీర్ ప్రభాకర్‌ని పిలిపించేడు శ్రీధర్.

"చూడండి మిస్టర్ ప్రభాకర్! నిన్న ఏం జరిగిందో మా ఆవిడ ద్వారా విన్నాను. మీది చాలా పేరున్న కంపెనీ అన్న సంగతి మీకూ తెలుసు. ఉద్యోగుల మీద ఎంతో విశ్వాసముంచి యాజమాన్యం విధులను అప్పచెప్తుతారు. ఆ పనికి మీకు జీతాలిస్తారు. దాన్ని సద్వినియోగం చేసుకుని ఒకళ్ల సహకారంతో మరొకరు లాభం పొందాలి కాని- ఇలాంటి పని మరెప్పుడూ, ఇంకెక్కడా రిపీట్ చేయకండి. మీ ఆఫీస్‌కి ఫోన్‌చేసి జరిగినది చెప్తే మీ ఉద్యోగం పోతుంది. దానివల్ల సమస్య పరిష్కారం కాకపోగా కాంప్లికేషన్స్ పెరిగి మీలో కసి పెరగవచ్చు.

ఈరోజు ఆదివారం కాబట్టి- కుదరదు- రేపు అంటే సోమవారం ప్రొద్దున 11 గంటలకి మీ కంపెనీ పేరుమీద ముప్ఫై ఐదువేలకి డి.డి. రెడీగా వుంటుంది నా దగ్గిర. మీరు మా ఇంట్లో ఏ ఏ ఎక్విప్‌మెంట్స్ అటెండ్ అయ్యేరో, ఏ స్పేర్స్ వేసేరో, అన్నీ వివరంగా మీ సర్వీస్ రిపోర్టులో వ్రాసి యివ్వండి. అందులో క్యాష్‌గా పదిహేను వేలు, ముప్ఫైఐదు వేలు డి.డి. రూపంలోనూ ఇచ్చినట్లుగా మొత్తం కూడా యాభైవేలకి నాకు రసీదు యివ్వండి. నేనే సంతకం పెట్టి ఒరిజినల్ కాపీ తీసుకుని మీకు డి.డి.తోపాటు డూప్లికేట్ కాపీ ఇస్తాను. నా భార్య దగ్గిర తీసుకున్న పదిహేను వేలతో పాటు ముప్ఫైఐదు వేల డిమాండ్ డ్రాఫ్టును కూడా మీరు మీ కంపెనీలో జమచేయండి రేపు. దీనికేమాత్రం వ్యతిరేకంగా జరిగినా నేను దేనికీ జంకను" అని ఖచ్చితంగా చెప్పేడు శ్రీధర్.

❊ ❊ ❊

ఆరోజు సోమవారం-

తను చెప్పినట్లుగానే ప్రభాకర్ చేసినట్లు రూఢి చేసుకున్నాక ఆఫీస్‌కి బయలుదేరేడు శ్రీధర్.

ఆఫీస్‌లో అడుగుపెడ్తూనే "గుడ్ మార్నింగ్ సార్" అని మొట్టమొదట విష్‌చేసిన సురేష్‌ని చూసి ఒక్క క్షణం షాక్ అయ్యేడు శ్రీధర్.

"గుడ్ మార్నింగ్. కం టు మై క్యాబిన్" అన్నాడు.

లోపలికి వస్తూనే- ఇరవై ఐదువేల డిమాండ్ డ్రాఫ్ట్ ఒకటి శ్రీధర్ ముందర పెట్టేడు సురేష్.

అనుకోని ఆ సంఘటనకి ఖంగుతిన్న శ్రీధర్- "ఏమిటిది"? అని అడిగేడు.

"సార్! భగీరథ కన్‌స్ట్రక్షన్స్ నుండి తెచ్చేను. నేను లీవ్ మీద వెళ్లినా కూడా ఆఫీషియల్ డ్యూటీ తప్పలేదు నాకు. ఏకంగా ఆ కంపెనీ డైరెక్టరే నా మొబైల్‌కి ఫోన్ చేసి వాళ్లకి ఇన్‌స్పెక్షన్ వుందని మెషిన్స్ ట్రబుల్ ఇస్తున్నాయనీ, వాటికి సర్వీసింగ్ చేసి క్యాలిబ్రేషన్ చార్ట్స్ అర్జంట్‌గా ఇమ్మనీ రిక్వెస్ట్ చేసేరు. నేను ఆఫీస్‌లో లేననీ, లీవ్ మీద హైదరాబాద్‌లో వున్నాననీ, నా దగ్గిర టూల్ కిట్ అవీ ఏంలేవనీ చెప్పినా కూడా ఆయన అన్నీ అరేంజ్ చేయిస్తానని చెప్పి హైదరాబాద్‌లో వున్న వాళ్ల లోకల్ ఆఫీస్‌నుండి సైట్‌కి వెళ్లడానికి కారుతో పాటు మనిషిని కూడా పంపించేరు- నేను వెళ్లనేమోనని. వాళ్లు మనకి రెగ్యూలర్‌గా చాలా బిజినెస్ ఇచ్చే కస్టమర్ అవడంతో 'నో'అని చెప్పలేకపోయేను. వాళ్లదగ్గిర వున్న టూల్స్‌తో అప్పటికి పని అయిందనిపించీ వాళ్ల ఇన్‌స్పెక్షన్‌కి ప్రాబ్లమ్ రాకుండా క్యాలిబ్రేషన్ చార్ట్స్ ఇచ్చి- మెషిన్స్ మళ్లీ ట్రబుల్ ఇవ్వకుండా వర్కింగ్ కండిషన్‌లో పెట్టడానికి ఏమేం స్పేర్స్ కావాలో అన్నీ చెప్పేను. చెక్‌బుక్ అందుబాటులో లేకపోవడంతో వాళ్ల సైట్ ఇంజినీర్ క్యాష్ అరేంజ్ చేసేరు. అంత డబ్బు దగ్గిర వుంచుకోవడం రిస్క్ అనుకుని మన అకౌంటింగ్‌కి కూడా ప్రాబ్లమ్ అవకూడదని- అదే రోజు డి.డి. తీసుకున్నాను" అంటూ చెప్తున్న సురేష్ తన సెల్ మ్రోగడంతో చూసి - "బి.సి.ఎల్ నుండే సార్! వాళ్లకి కావల్సిన స్పేర్స్ అవీ తీసుకుని ఈ రోజు టూర్‌కి వెళ్లాలి మళ్లీ. నేను తర్వాత వచ్చి మాట్లాడతాను మీతో" అంటూ క్యాబిన్ వదిలి వెళ్లేడు.

తన క్యాబిన్‌లోకి గబగబా వచ్చి- డి.డి. తన ముందుంచి, చెప్పవలసినది చెప్పి- మళ్లీ అంతే స్పీడుతో కస్టమర్‌ని అటెండ్ అవడానికి వెళ్లిన సురేష్‌ని చూసి తెల్లమొగం వేసేడు శ్రీధర్.

❊ ❊ ❊

ఆ మధ్యాహ్నం-

బ్యాంక్ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి బ్యాంక్‌కి వెళ్లేడు శ్రీధర్. ఓవర్ డ్రాఫ్ట్ తీసుకుని- వర్కర్స్ అందరికీ ఎరియర్స్‌తోపాటు బోనస్ కూడా ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు.

"సురేష్ లాంటి కమిటెడ్ ఉద్యోగులు తన కంపెనీలో పనిచేయడమే తనకి పెట్టనికోట. ఇలాంటి డెడికేటెడ్ స్టాఫ్ దగ్గర ఉంటే ఎలాంటి ఆర్థిక సంక్షోభాన్నైనా కంపెనీ ధైర్యంగా ఎదుర్కోగలదు. డబ్బు రూపంలో ఇచ్చే ఈ బోనస్- స్టాఫ్ అందుకున్నప్పుడు- వాళ్ల కళ్లల్లో మెరిసే వెలుగుకంటే తన జీవితానికి పెద్ద బోనస్ మరేమీ ఉండదని" అనుకున్నాడు శ్రీధర్. ★

